సాక్షి తిరుపతి

గురువారం । 25 । మే । 2023



భవితకు 'ఉపకార'ం

పేద విద్యార్థుల చదువుకు కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తోంది. యశస్వి పథకం కింద ఉపకారవేతనం అందిస్తోంది.

- 8లో



ప్రయోగ వేదికపై జీఎస్ఎల్వీ

శ్రీహరికోట షార్‌లో ఈ నెల 29వ తేదీన ప్రయోగించనున్న జీఎస్ఎల్వీ ఎఫ్12 రాకెట్ మూమెంట్‌ను బుధవారం నిర్వహించారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	39	28
చిత్తూరు	38	27
తిరుమల	34	23
గూడూరు	42	30
నగరి	40	28

పేదల చదువుకు 'దీవెన'

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు.. ఆర్థిక స్థితిగతుల కారణంగా ఇబ్బందులు తలెత్తకూడదు.. ఉన్నత విద్యతోనే సమాజంలో అసమానతలు తొలగుతాయి.. నిరుపేద కుటుంబాలు సైతం పురోభివృద్ధి సాధిస్తాయి.. పోటీ ప్రపంచంలో దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తాయి.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టారు. అందులో భాగంగా పేద పిల్లలకు ఉన్నత విద్య భారం కాకుండా 'జగనన్న విద్యాదీవెన' అమలు చేస్తున్నారు. ఈ ఏడాది తొలి త్రైమాసికానికి సంబంధించి లబ్ధిదారుల ఖాతాల్లో బుధవారం కంప్యూటర్ బటన్ నొక్కి నగదు జమ చేశారు.

- విద్యతోనే ఉన్నత భవిష్యత్తు
- విద్యార్థులకు అండగా ప్రభుత్వం
- కలెక్టరేట్‌లో జగనన్న విద్యాదీవెన జిల్లా స్థాయి కార్యక్రమం
- 30,259 మంది పిల్లలకు లబ్ధి
- తల్లుల ఖాతాల్లో రూ.27.15 కోట్లు జమ



విద్యార్థులకు మెగా చెక్కు అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు

తిరుపతి అర్బన్ : జగనన్న విద్యాదీవెన పథకం కింద ప్రభుత్వం పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందిస్తోందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో జగనన్న విద్యాదీవెన పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది తొలి మూడు నెలలకు సంబంధించి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి చెన్నయ్య, బీసీ సంక్షేమశాఖాధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి త్రైమాసికానికి 9.95లక్షల మందికి గాను రూ.703 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించడం గొప్ప విషయమన్నారు. జిల్లాలో 30,259 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు సుమారు రూ. 27.15 కోట్లు నగదు జమ చేసినట్లు వెల్లడించారు. పిల్లల చదువులకు వెచ్చించే నగదును భవిష్యత్‌కు పెట్టుబడిగా భావించాలని ముఖ్యమంత్రి చెబుతుంటారని తెలిపారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టేలా విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు అందించారు.

నియోజకవర్గం	విద్యార్థుల తల్లుల సంఖ్య	జమ చేసిన మొత్తం (రూ.కోట్లలో)
చంద్రగిరి	5,829	5.23
తిరుపతి	4,930	4.79
శ్రీకాళహస్తి	4,793	4.19
గూడూరు	3,616	3.59
సూళ్లూరుపేట	3,510	3.26
సత్యవేడు	3,405	2.58
వెంకటగిరి	2,440	2.13
నగరి	1,736	1.38

విప్లవాత్మకమార్పులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. నేను పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని. ఆర్థిక స్తోమత లేక చదువు ఆగిపోయింది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన విద్యాదీవెన పథకం ద్వారా నేను తిరుపతి ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాలలో చదువుకోగలుతున్నా. మా తల్లిదండ్రులకు నా చదువు భారం తప్పింది.

– స్రవంతి, విద్యార్థిని, తిరుపతి

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన విద్యాదీవెన పథకం మాలాంటి పేద పిల్లలకు ఎంతో ఉపయోగపడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించడంతో ఉన్నత విద్యను సులువుగా అభ్యసిస్తున్నాం. ప్రభుత్వ సాయంతో తిరుపతిలోని ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాలలో చదువుకుంటున్నా. మాకు ఇంత సాయం చేస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– ఉషశ్రీ, విద్యార్థిని, తిరుపతి

మంచి పరిపాలన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి పరిపాలన అందిస్తున్నారు.విద్యారంగం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. ప్రభుత్వం అండగా నిలవడం వల్లే మా కుమార్తె ప్రసన్న లక్ష్మి పుత్తూరు సిద్ధార్థ కళాశాలలో చదువుకుంటోంది. తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. ముఖ్యమంత్రి మేలును మరువలేం. **– మోహన్‌గుప్తా దంపతులు, పుత్తూరు**

న్యూస్‌రీల్

నేడు పుత్తూరులో జాబ్ మేళా

తిరుపతి కల్చరల్ : యువజన సర్వీసుల శాఖ, ప్రభుత్వం, సెట్విన్, ఉపాధి కల్పన కార్యాలయం, ఎస్వీయూనివర్సిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు పుత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభాస్ వి.కేర్ హెల్త్ క్లినిక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కాల్ సెంటర్, సపోర్ట్ స్టాఫ్, బ్యూటీ థెరపిస్ట్ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన యువతీ యువకులందరూ మేళాకు హాజరుకావచ్చని సూచించారు. వివరాలకు 7989810194, 7397778425 నంబర్లను సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తం.. శాంతి తిరుమంజనం



తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయమహాసంప్రోక్షణలో భాగంగా బుధవారం శాస్త్రోక్తంగా మహాశాంతి తిరుమంజనం నిర్వహించారు. ముందుగా ఉదయం ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో హోమగుండాలను వెలిగించి పుణ్యాహవచనం, విష్వక్సేనారాధన, కుంభారాధన, పంచగవ్యారాధన జరిపించారు. అనంతరం జలాధివాసం, బింబస్థాపన చేపట్టారు. సాయంత్రం మహా శాంతి తిరుమంజనం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ రవికుమార్, సూపరింటెండెంట్లు మోహన్‌రావు, నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ధనంజయులు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పశుఆరోగ్య రథాల్లో పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవా రథాల్లో పోస్టులకు ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా పశువైద్యాధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డాక్టర్లుగా పనిచేయడానికి బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత ఉండాలని స్పష్టం చేశారు. ప్యారావెట్‌కు డిప్లమా ఇన్ వెటర్నరీ సైన్స్ విద్యార్హతగా పేర్కొన్నారు. 30 ఏళ్ల లోపు వయసు ఉండాలని వెల్లడించారు.పైలెట్ పోస్టుకు పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు 35 ఏళ్లలోపువారు అర్హులని, అలాగే 2–3 ఏళ్ల అనుభవంతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని వివరించారు. వివరాలకు జిల్లా మేనేజర్ రామలింగేశ్వర్‌రెడ్డిని 7207702466 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయాధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న వీడీవీ కృపాదాస్

తిరుపతి అర్బన్ : వ్యవసాయశాఖ అధికారులు తరచూ ఎరువుల, విత్తనాలు, పురుగుమందులను విక్రయిస్తున్న దుకాణాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని సంయుక్త వ్యవసాయ సంచాలకుడు (వనరులు)వీడీవీ కృపాదాస్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో తిరుపతి, చిత్తూరు జిల్లాల వ్యవసాయాధికారులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. కృపాదా మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎరువుల దుకాణదారులు లైసెన్సను రెన్యూవల్ చేసుకుంటున్నారా, నిబంధనలు పాటిస్తున్నారా అనే విషయాలను గుర్తించాలని సూచించారు. సాగులో కొత్త పద్ధతులు, మార్కెట్‌లో డిమాండ్‌తో పాటు తక్కువగా తెగులు సోకే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సహాయ సంయుక్త సంచాలకులు జి.వెంకటేశ్వరరావు, కేజేడీ రాజన్, పి.మద్దులేటి, వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి , తిరుపతి, చిత్తూరు జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు ప్రసాద్‌రావు, మురళీకృష్ణ, కలెక్టరేట్ ఏడీ ధనంజయరెడ్డి, వ్యవసాయాధికారి గాయత్రి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్టుమెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 75,875 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 35,439 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.09 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టోకెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టోకెట్లు లేని వారికి 15 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

28న యూపీఎస్సీ ప్రిలిమ్స్

- హాజరుకానున్న 6,333 మంది అభ్యర్థులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : యూపీఎస్సీ ప్రిలిమ్స్–2023ను ఈ నెల 28వ తేదీన ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పరీక్షల విధులు నిర్వర్తించనున్న అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా యూపీఎస్సీకి మొత్తం 6,333 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి 11.30 వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరగనున్నట్లు వివరించారు. మొత్తం 13 కేంద్రాలకు ఏడుగురు జిల్లాస్థాయి అధికారులను సహాయ సమన్వయకర్తలుగా, 13 మంది తహసీల్దార్లను సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించినట్లు తెలిపారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ వారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించాలని ఆదేశించారు. ఆర్డీఓ కస్టోడియన్‌గా తన కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని కోరారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని, అభ్యర్థులు 10 నిముషాల ముందే రావాలని, ఒక్క నిముషం ఆలస్యమైనా లోపలికి పంపించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కంటి లోపం, దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షల అబ్జర్వర్లు త్వరలోనే రానున్నారని వివరించారు. డీఆర్ఓ శ్రీనివాసరావు, ఏడీ సర్వే జయరాజ్, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు, చీఫ్ సూపరింటెండెంట్ జరీనా బేగం పాల్గొన్నారు.

ప్రాజెక్టులను అడ్డుకోవడం బాబుకు తగదు



వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి

- ఈసారి టీడీపీకి డిపాజిట్లు కూడా రావు
- అందుబాటులో రైతులకు విత్తనాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: పుంగనూరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో సాగు నీటి ప్రాజెక్టు పనులను అడ్డుకోవడం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తగదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం రొంపిచెర్లలో రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ ప్రభుత్వం మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టామన్నారు. ఇవి పూర్తయితే వైఎస్సార్‌సీపీకి పేరు వస్తుందనే భయంతో చంద్రబాబు పనులు జరగకుండా స్టే తీసుకుని వచ్చారని ఆరోపించారు. రైతుల అభ్యున్నతికి రూ.వందల కోట్లు ఖర్చు చేస్తుంటే చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. ఈ రిజర్వాయర్లు పూర్తి అయితే సాగు నీటితోపాటు తాగునీటికి కూడా ఇబ్బంది ఉండదన్నారు.చంద్రబాబు చేస్తున్న పనులను ప్రజలు చూస్తున్నారని, రానున్న ఎన్నికలలో చిత్తూరు జిల్లాలో టీడీపీకి డిపాజిట్లు కూడా రావన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మంది పేదల ఇళ్ల నిర్మాణాలకు పట్టాలను ఇస్తే వాటిని ఏడాదిన్నర పాటు కోర్టులో అడ్డుకున్నారని అన్నారు. చంద్రబాబుకు అభివృద్ధి అడ్డుకోవడం తప్ప సంక్షేమం చేతకాదని విమర్శించారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో ఇస్తున్న వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. ఖరీఫ్ సాగు కోసం నాణ్యమైన విత్తనాలను గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విత్తనాలను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సబ్సిడీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్లలో 131 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్లుగా నివాసం ఉన్న వారికి ప్రొవిజన్ సర్టిఫికెట్లను ఇవ్వాలని రెవెన్యూ అధికారుల అదేశించారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, ఎంపీడీవో రాజేంద్ర, ఏవో సుధారాణి, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు

తిరుపతి అర్బన్ : జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఫ్యాక్టరీల్లో తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. సింగిల్ డెస్క్ విధానంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 57 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామన్నారు. మరో 23 పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. 55 పరిశ్రమలకు రూ.2.48 కోట్ల ప్రోత్సాహకాలను అందించేందుకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. అనంతరం ఏర్పేడు మండలం మాధవమాలలో వుడ్ కార్వింగ్ క్లస్టర్, కాపర్ వేజెల్స్ క్లస్టర్ , రేణిగుంట మండలంలోని ఎర్రమరెడ్డిపాళెం , వెంకటగిరి శారీ ప్రింటింగ్, డైయింగ్ క్లస్టర్, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటునకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి పాల్గొన్నారు.

పాల సేకరణ పెంపునకు కృషి

జగనన్న పాలవెల్లువ కింద పాల సేకరణ పెంపునకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం మండలాల్లోని ఏడు రూట్లలో వందశాతం పాలసేకరణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో 4,183 మంది రిజిస్టర్డ్ పాడి రైతులు ఉన్నారని, అందులో 97 మందికి డీసీసీబీ ద్వారా రూ.27.40 లక్షలు రుణాలు అందించామని, చేయూత ద్వారా 844 మంది రైతులకు 831 పశువులను పంపిణీ చేశామని వివరించారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటరమణ,డీఆర్‌డీఏ పీడీ జ్యోతి పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 122 కేంద్రాలను ఏర్పాటుచేశారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సర, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలను నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ రమేష్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరా నిఘా, లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

993 మంది గైర్హాజరు

తొలిరోజు ఫస్టియర్ పరీక్షకు 11,226 మందికి గాను 706 మంది, అలాగే ద్వితీయ సంవత్సర పరీక్షకు 2,684మందికి గాను 287మంది, మొత్తం 993మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ వివరించారు.

పరుగుల ప్రవాహం

- చంద్రగిరి ఐపీఎల్ టోర్నీలో చెలరేగిన బ్యాట్స్‌మన్
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- క్రీడాకారులకు మెడల్స్ పంపిణీ
- ముగిసిన లీగ్ మ్యాచ్‌లు
- నేటి నుంచి నాలుగు రోజులపాటు విరామం

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ గ్రామీణ యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో గత 11 రోజులుగా నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్ పోటీలు మొదటి దశ లీగ్ పోటీలు ముగిశాయి. బుధవారం మొత్తం 52 మ్యాచ్‌లు జరిగాయి. లీగ్ దశ పూర్తవుతున్న సందర్భంగా చంద్రగిరి, తిరుపతి రూరల్ జర్నలిస్టుల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ ఏర్పాటు చేశారు. మూడు పరుగుల తేడాతో తిరుపతి రూరల్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. ముఖ్యంగా బ్యాట్స్‌మన్ చెలరేగిపోయి పరుగుల ప్రవాహం సృష్టించారు. పలువురు బౌలర్లు పదునైన బంతులతో వికెట్లు తీశారు.



బౌండరీ లైన్ దాటాల్సిందే..

నిపుణులైన అంపైర్ల పర్యవేక్షణ

చంద్రగిరి ఐపీఎల్ టోర్నమెంట్‌లో నిపుణులైన అంపైర్లు మ్యాచ్‌లను పర్యవేక్షిస్తున్నారు. పారదర్శకంగా అంపైర్ల నిర్ణయాలు ఉండడంతో ఎలాంటి వివాదాలు తలెత్తలేదు. క్రీడాకారులు సైతం పూర్తి స్వేచ్ఛగా ఆటలో తమ ప్రతిభను కనబరిచారు. విజయమే లక్ష్యంగా పోరాటపటిమను ప్రదర్శించారు.

నేటి నుంచి నాలుగు రోజులు విరామం

తుమ్మలగుంట వేదికగా నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్ టోర్నమెంట్ మొదటి దశ లీగ్ పోటీలు బుధవారంతో ముగిశాయి. మొత్తం 1000 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నమెంట్‌లో ఇప్పటికే 500 మ్యాచ్‌లను నిర్వహించారు. 11 రోజుల పాటు టోర్నమెంట్ నిరంతరాయంగా నిర్వహించడం, అంపైర్లు, టోర్నమెంట్ నిర్వాహక బృందం వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి సుదూర ప్రాంతాల నుంచి రావటం, క్రీడా మైదానాల నిర్వాహణ తదితర కారణాల వల్ల గురువారం నుంచి నాలుగు రోజుల పాటు టోర్నమెంట్‌కు విరామం ప్రకటించారు. మళ్లీ 29 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని టోర్నమెంట్ కార్యానిర్వాహక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మొదటి దశ పోటీలు విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా టోర్నీని జరిపించనున్నట్లు వెల్లడించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

క్రికెట్ పోటీల్లో విజేతలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, తిరుపతి రూరల్ మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, చిగురువాడ సర్పంచ్ ప్రదీప్ రెడ్డి, అవిలాల డివిజన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు లోకనాథ రెడ్డి చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మునిక్రిష్ణ, సర్పంచ్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, లోకనాథరెడ్డి

గంగమ్మ కటాక్షం.. ప్రజలు సుభిక్షం



అమ్మవారికి హారతి సమర్పిస్తున్న కంచి పీఠాధిపతి

తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ కటాక్షంతో ప్రజలు సుభిక్షంగా ఉంటారని కంచికామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి తెలిపారు. బుధవారం తిరుపతిలో తాతయ్యగుంట గంగమ్మను వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి మీడియాతో మాట్లాడుతూ ఆలయ మహాకుంభాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారని, తల్లి కరుణతోనే మూడు రోజులపాటు వర్షాలు కురిశాయని వివరించారు. నేడు కూడా స్వామి ఆలయంలోకి రాగేనే వర్షం కురవడం విశేషం. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీ యాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి 'ఈ-శ్రామ్'

తిరుపతి రూరల్ : అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పోర్టల్ ప్రవేశపెట్టినట్లు జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని డీసీయల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, భవన నిర్మాణ, అనుబంధ రంగాల్లోని వారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, డ్రెస్ మేకర్స్, ఆటోమొబైల్, రవాణా రంగంలో పనిచేసేవారు, చేతి వృత్తుల పనివారు, స్వయం ఉపాధి, సేవా రంగంలో విధులు నిర్వర్తించేవారు, ప్రభుత్వ పథకాలు అమలు కానివారు, హమాలీలు, దుకాణాల్లోని కార్మికుల్లో 16 నుంచి 59 ఏళ్లోపు వారు ఈ-శ్రామ్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. వారికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు(యూఏఎన్) జారీ చేస్తారని, దీంతో అన్ని పథకాలు వర్తింపజేస్తారని వెల్లడించారు. కార్మికుడికి ఏడాదిలోపు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన(పీఎంఎస్‌బీవై) కింద రూ.2 లక్షలు అందజేస్తారని తెలిపారు. ఆసక్తిగలవారు ఆధార్, మొబైల్ నంబర్, బ్యాంకు పాసుపుస్తకం తీసుకుని, అన్ని సచివాలయాల్లో, కామన్ సర్వీస్ సెంటర్లలో ఉచితంగా పేరు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

- విద్యార్థుల చదువుకు కేంద్రప్రభుత్వ సాయం
- పీఎం యశస్వి పథకంతో ఉపకార వేతనం
- దరఖాస్తుకు ఆగస్టు 26 ఆఖరు తేదీ
- సెప్టెంబర్ 11న ఆన్‌లైన్‌లో పరీక్ష

భవితకు ఉపకారం



తిరుపతి ఎడ్యుకేషన్ : ఉన్నత విద్యను అభ్యసించాలని ఉన్నప్పటికీ పేద కుటుంబాల్లోని విద్యార్థులకు ఆర్థిక పరిస్థితుల సహకరించడం లేదు. ప్రతిభ ఉన్నప్పటికీ స్తోమత లేక చదువు మాని ఉపాధి బాట పడుతున్నారు. అలాంటి పేద పిల్లలకు అండగా నిలిచేందుకు కేంద్రప్రభుత్వం 'పీఎం యశస్వి' ఉపకార వేతన పథకానికి శ్రీకారం చుట్టింది. 'యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా' (యశస్వి) పేరుతో కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వశాఖ పరిధిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది.

అర్హత సాధించేందుకు..
యశస్వి ఉపకార వేతనానికి అర్హత పొందేందుకు కేంద్ర విద్యాశాఖ అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో నిర్వహించే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి.పరీక్ష రాసేందుకు విద్యార్థికి 8వ తరగతి పూర్తయి ఉండాలి. అలాగే 9, 10వ తరగతి పూర్తయిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5లక్షలలోపు ఉండాలి. గ్రామాల్లోని నిరుపేదలు, రైతులు, అణగారిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు.

ఆగస్టు 26వరకు దరఖాస్తులు
యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష రాయదలచిన విద్యార్థులు ఆగస్టు 26వ తేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులో మార్పులు చేర్పులు చేసుకోవడానికి ఆగస్టు 27 నుంచి 31వ తేదీ వరకు అవకాశం కల్పించారు. సెప్టెంబరు 5నుంచి అడ్మిట్ కార్డులు పొందవచ్చు. 11వ తేదీన మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో హిందీ, ఇంగ్లీష్ మీడియంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీవారు పరీక్ష నిర్వహిస్తారు.

దరఖాస్తు ఇలా..
ప్రవేశ పరీక్ష రాసేందుకు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో పేరు నమోదు కావాలి. పేరు, ఈ-మెయిల్, అడ్రస్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితర వివరాలతో ఓ అకౌంట్‌ను క్రియేట్ చేసుకోవాలి. తర్వాత దరఖాస్తుదారుడికి అప్లికేషన్ నంబరు వస్తుంది. అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి. చదువు, గుర్తింపు కార్డు తదితర వివరాల డాక్యుమెంట్ల సాఫ్ట్ కాపీలను అప్‌లోడ్ చేసి సైన్ అప్ కావడంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. ఇందుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. పరీక్ష ప్రవేశ కార్డు జారీ చేసే తేదీ ఇతర వివరాలను ఆ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చు.

పరీక్ష ఇలా..
మూడు గంటలపాటు కొనసాగే పరీక్షను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో నిర్వహిస్తారు. పరీక్షకు వంద బహుళ ఐచ్ఛిక ప్రశ్నలుంటాయి. గణితంలో 120 మార్కులకు 30ప్రశ్నలు, సైన్సులో 80 మార్కులకు 20 ప్రశ్నలు, సోషియల్‌లో 100 మార్కులకు 25 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్‌లో 100 మార్కులకు 25 ప్రశ్నలుంటాయి. దేశవ్యాప్తంగా దాదాపు 78 నగరాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు.

ఉపకార వేతనం వివరాలు
యశస్వి పథకానికి అర్హత పొందిన విద్యార్థుల్లో 9, 10వ తరగతులకు ఏటా రూ.75వేలు, ఇంటర్మీడియట్ లేదా 11, 12వ తరగతులకు ఏటా రూ.1.25లక్షలు ఉపకార వేతనాన్ని ఒకే విడతలో అందిస్తారు.

అర్హత సాధించిన అనంతరం
అర్హత సాధించిన విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. బ్యాంకు పాస్ పుస్తకం ఫొటోకాపీని జత పరచాలి. ఈ నగదుతో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏ పాఠశాల, కళాశాలలో అయినా విద్యార్థులు చదువుకోవచ్చు. ఆయా వివరాల లింకులను సైతం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,560
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,618

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,400
రిటైల్ వెండి గ్రాము	రూ.75.40

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

రేణిగుంట: రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం గూడ్సు రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్‌ఐ రవి తెలిపారు. నార్త్ క్యాబిన్ వద్ద వృద్ధుడు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు వెల్లడించారు. మృతుడి ఒంటిపై నీలిరంగు గళ్ల చొక్కా, పంచె ఉన్నట్లు వివరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించామన్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే రేణిగుంట జీఆర్పీ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

మహిళ హత్య కేసులో నిందితుల అరెస్ట్

నాయుడుపేటటౌన్ : గుర్తుతెలియని మహిళ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఈ మేరకు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. బీహార్‌కు చెందిన దశరథ్ సహానీ, భాగేశ్వర్ సహానీ, అఖిలేష్ కుమార్, సోను కుమార్, శత్రుధన్, రాజ్‌కుమార్ సహానీ శ్రీకాళహస్తి రోడ్డులోని ఓ గోదాములో పనిచేస్తున్నారు. ఫిబ్రవరి 27వ తేదీ రాత్రి ఓ వేశ్య(సుమారు 40)ను తమ వెంట గోదాముకు తీసుకెళ్లారు. తమ వాంఛ తీరిన తర్వాత గొంతు నులిమి చంపేశారు. మృతదేహాన్ని గోదాములోని గోతాముల కింద పడేసి పారిపోయారు. తర్వాత ఈ నెల 2వ తేదీన కుళ్లిస్థితిలో మృతదేహం వెలుగు చూసింది. దీనిపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. గోదాము నిర్వాహకులు నెల్లూరు సిద్ధయ్య, బాలచంద్ర, మధుసూదన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, తమ వద్ద బీహార్‌కు చెందిన కొందరు కార్మికులు పనిచేసేవారని, వారు గోదాములోనే ఉండేవారని, ఇటీవల చెప్పాపెట్టకుండా వెళ్లిపోయారని తెలిపారు. దీంతో సీఐ నరసింహారావు నేతృత్వంలో ఎస్‌ఐలు శ్రీకాంత్, కృష్ణారెడ్డి, రవి బాబు, మనోజ్‌కుమార్‌తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం సూళ్లూరుపేటలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ, ఎస్‌ఐలతోపాటు, హెడ్ కానిస్టేబుళ్లు షేక్ కరీం సాహెబ్, మస్తాన్, నరసింహ, కానిస్టేబుళ్లు దయాకర్, శివ,కుమార్, భానుతేజ, రమేష్, సునీల్, శివకృష్ణారెడ్డి, కిషన్, గురుకిరణ్‌ను డీఎస్పీ అభినందించారు.

ప్రయోగ వేదికపై జీఎస్ఎల్‌వీ ఎఫ్12

- సజావుగా రాకెట్ మూమెంట్
- పూర్తయిన అసెంబ్లింగ్ వర్క్
- రిహార్సల్స్ అనంతరం కౌంట్‌డౌన్



అనుసంధానం అనంతరం జీఎస్ఎల్‌వీ ఎఫ్12

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈనెల 29న ఉదయం 10.42 గంటలకు ప్రయోగించనున్న జీఎస్ఎల్‌వీ ఎఫ్12 రాకెట్ మూమెంట్‌ను శాస్త్రవేత్తలు సజావుగా నిర్వహించారు. వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో అనుసంధానం పూర్తి చేసుకున్న జీఎస్ఎల్‌వీ ఎఫ్12 రాకెట్‌ను మంగళవారం రాత్రి షార్ అధికారులు ఉంబ్లికల్ టవర్ (ప్రయోగవేదిక)కు అనుసంధానం చేసేందుకు తరలించారు. రెండో ప్రయోగ వేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో మూడు దశల రాకెట్‌ను అనుసంధానం చేసి పలు పరీక్షలు నిర్వహించారు. వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ నుంచి ఉంబ్లికల్ టవర్‌దాకా రైలు పట్టాలు లాంటి ట్రాక్‌పై రాకెట్‌ను నెమ్మదిగా తరలించి ప్రయోగ వేదికకు అనుసంధానం చేశారు. దీంతో రాకెట్ అసెంబ్లింగ్ వర్క్ పూర్తయింది. ఇకపై రాకెట్‌కు లెవెల్-1, లెవెల్-2, లెవెల్-3 పరీక్షలు నిర్వహించి రిహార్సల్ చేయనున్నారు. రాకెట్ రిహార్సల్స్ అయిన తరువాత ఎంఎంఆర్ సమావేశం, ల్యాబ్ సమావేశం అనంతరం కౌంట్‌డౌన్ సమయాన్ని, ప్రయోగసమయాన్ని అధికారికంగా ప్రకటిస్తారు.

నమూనా రాకెట్ ప్రయోగాలు చేసిన విద్యార్థులు





లాంచ్ వ్యూ గ్యాలరీలో మోడల్ రాకెట్లను ఎగురవేస్తున్న విద్యార్థులు, షార్ ఇంజినీర్లు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెల 16 నుంచి నిర్వహిస్తోన్న యువికా-2023 యంగ్‌సైంటిస్ట్ ప్రోగ్రాంలో భాగంగా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని లాంచ్ వ్యూ గ్యాలరీ ప్రాంతంలో బుధవారం విద్యార్థులతో నమూనా రాకెట్ ప్రయోగాలను చేయించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇస్రో సెంటర్లలోని 7 కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరిగింది. దేశవ్యాప్తంగా 8, 9 తరగతులు చదువుతూ ఎంతో ప్రతిభ ఉన్న 353 మంది విద్యార్థులను దీనికి ఎంపిక చేశారు. ఇందులో షార్ కేంద్రానికి 56 మందిని పంపించారు. అంతరిక్ష ప్రయోగాలపై వారికి ఆసక్తిని పెంచేందుకు అవసరమైన కార్యక్రమాలన్నింటినీ నిర్వహించి మోడల్ రాకెట్లను ప్రయోగించే కార్యక్రమాలను చేపట్టారు. బుధవారం చిన్న మోడల్ రాకెట్లను తయారు చేసి వాటిని ప్రయోగించి వారిని ఉత్సాహపరిచారు. షార్ కేంద్రంలోని ప్రయోగవేదికలు, లాంచింగ్ సౌకర్యాలపై షార్ ఇంజినీర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రాయితీ విద్యుత్‌కు ఆక్వా రైతుల వినతి



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : రొయ్యల సాగుకు సరఫరా చేసే విద్యుత్ కనెక్షన్లన్నింటికీ సబ్సిడీపై అందించాలని ఎంపీ గురుమూర్తికి ఆక్వారైతులు విన్నవించారు. బుధవారం తిరుపతిలోని కార్యాలయంలో ఎంపీని చిట్టమూరు మండలానికి చెందిన ఆక్వా రైతుల కలిశారు. మండలంలో సుమారు 1,300 ఆక్వా కరెంట్ కనెక్షన్లు ఉన్నాయని, దానిలో 136 కనెక్షన్లకి మాత్రమే రాయితీ ఇస్తున్నారని తెలిపారు. మిగిలిన వాటికి కూడా సబ్సిడీ ఇప్పించాలని పలుమార్లు మత్స్య శాఖ అధికారులను కలిసినా సమస్య పరిష్కారం కాలేదని తెలియజేశారు. దీనిపై ఎంపీ గురుమూర్తి వెంటనే స్పందించారు. మత్స్యశాఖ కమిషనర్‌తో మాట్లాడారు. ఆక్వా జోన్ పరిధిలోకి రాకపోవడం వల్ల వారికి సబ్సిడీ వర్తించడం లేదని కమిషనర్ వివరణ ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా మరోసారి సర్వే చేసి ఆక్వా రైతులకు న్యాయం చేయాలని సూచించారు. సమావేశంలో మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్ నాయక్ , ఏడీ చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ ఏపీ జట్టు



విజేతగా నిలిచిన ఏపీ జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో నిర్వహించిన 2వ జాతీయ స్థాయి ఫ్లోర్ కర్లింగ్ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్-2023లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఏపీ జట్టు కైవసం చేసుకున్నట్లు కర్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.వెంకటేశ్వరమ్మ, వై.మోహన్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో తిరుపతికి చెందిన ఎం.తనుశ్రీ రెండు బంగారు పతకాలు, యజ్ఞశ్రీ వెండి పతకం సాధించినట్లు వెల్లడించారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



సమావేశంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, మోహిత్‌రెడ్డి

- నేటి నుంచి ఉచిత వైద్య శిబిరాలు

భాకరాపేట : ప్రజారోగ్యానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఎర్రావారిపాళెంలో వైద్య శిబిరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెవిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలపై గ్రామీణ స్థాయిలో ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో సైతం వైద్యం అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గురువారం మండలంలోని ఉస్తికాలయపెంట, యల్లమంద పంచాయతీల్లో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం సర్వం సిద్ధం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శివలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెంగల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, ఎంపీడీఓ అమరనాథ్, తహసీల్దార్ దస్తగగిరి పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణతోనే సుభిక్షం

బంగారుపాళెం: ధర్మ పరిరక్షణతోనే దేశం సుభిక్షంగా ఉంటుందని కంచికామ కోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి అన్నారు. మండలంలోని నలగాంపల్లెలోని శ్రీవిశ్వేశ్వర విరుపాక్షమ్మ ఆలయాన్ని బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ధర్మ పరిరక్షణకు కోసం కంకణబద్ధులు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయాల్లో నిత్యపూజలు, ఉత్సవాలు జరుగితేనే వర్షాలు కురుస్తాయని తెలిపారు. తహశీల్దార్ బెన్నురాజ్ తదితరులు పాల్గొన్నారు.

గోమాతను పూజించాలి
ప్రతి హిందువు గోమాతను పూజించాలని కంచికామ కోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి అన్నారు. ఆల్ ఇండియా పురోహిత్ సంఘం గౌరవ సలహాదారు, పురోహితుడు పాణ్యం శ్రీనివాసశర్మ దంపతుల ఆహ్వానం మేరకు పీఠాధిపతి మొగిలి గ్రామానికి విచ్చేశారు. శ్రీమొగిలీశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. గోశాలను సందర్శించి గోపూజ చేశారు.

గంజాయి పట్టివేత



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

గూడూరు : చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద ఎస్ఈబీ పోలీసులు బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో గంజాయి పట్టుబడింది. ఆర్టీసీ లగ్జరీ బస్సులో ప్రయాణిస్తున్న మహ్మద్ అలీ అనే వ్యక్తి నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వైజాగ్ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి కర్ణాటకకు తరలిస్తున్నట్లు ఇన్‌చార్జి ఏఈఎస్ విజయ్‌కుమార్ వెల్లడించారు. తనిఖీలో ఎస్‌ఐలు శేషమ్మ, గంగాధర్ హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.కిరణ్‌సింగ్, మునిశేఖర్, డీటీఎఫ్ సిబ్బంది దయాకర్, నారాయణ పాల్గొన్నారు.

సైనిక్ ఫలితాల్లో విశ్వం ప్రతిభ



ఎ.కరణ్



ఎ.పూజిత్



పి.అజయ్‌కుమార్



ఎస్.తనీష్

తిరుపతి ఎడ్యుకేషన్ : సైనిక్ స్కూల్లో 6, 9వ తరగతుల ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకుతో పాటు టాప్ 10లో 6ర్యాంకులు సాధించి తమ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఎం.నవదీప్ ప్రథమ ర్యాంకుతో పాటు సాధించాడని, ఎ.కరణ్, టి.దినేష్, ఎ.పూజిత్, పి.అజయ్‌కుమార్, ఎస్.తనీష్‌లు టాప్ 10 లో 6ర్యాంకులు సాధించి సత్తా చాటారని పేర్కొన్నారు.